నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
శనివారం 28, మార్చి 2026
పేజీలు:4



## ముత్యాల తలంబ్రాలతో

# మురిసిన రామయ్య

- వల్మిడిలో అంగరంగ వైభవంగా కళ్యాణ వేడుక
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝూన్సీ రాజేందర్‌రెడ్డి
- వేలాదిగా తరలివచ్చిన జనసందోహం
- 10వేల మందికి పైగా అన్నదానం
- అధ్యాత్మిక శోభతో వెలిగిపోయిన పాలకుర్తి నియోజకవర్గం

వల్మిడి (పాలకుర్తి),
(నేటి ఫోకస్‌న్యూస్ ప్రతినిధి శ్రావణ్)-మార్చి27:

పాలకుర్తి మండలంలోని చారిత్రక వల్మిడి గ్రామం భక్తి సాగరమైంది. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. స్థానిక శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పరిసర ప్రాంతాల నుండి భక్తులు వేలాదిగా తరలిరావడంతో వల్మిడి వీధులన్నీ రామనామ స్మరణతో మారుమూగాయి ఆలయ అర్చకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య, పండితుల సమక్షంలో సీతారాముల కళ్యాణం కనులపండువగా సాగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సి రాజేందర్ రెడ్డిలు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, ముత్యాల పుస్తె మెట్టలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక దృశ్యాన్ని తిలకించిన భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు ఉత్సవానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సి రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 10 వేల మంది భక్తులకు స్వయంగా వడ్డించి, అన్నప్రసాద వితరణ చేయడం విశేషం క్రమశిక్షణతో సాగిన ఈ సేవా కార్యక్రమంపై భక్తులు ప్రశంసల జల్లు కురిపించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీరాముని జీవితం సత్యం, ధర్మం మరియు న్యాయానికి ప్రతీక అని కొనియాడారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు. ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సానుకూలతను నింపుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకలో స్థానిక సర్పంచ్ నెరిటీ లక్ష్మి చంద్రయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు, ఆలయ ధర్మకర్తలు మరియు పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు.











# సిర్సనగండ్లలో సీతారాముల కల్యాణోత్సవం





## స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి జూపల్లి

కల్వకుర్తి, నేటి ఫోకస్ న్యూస్ మార్చి 27: చారిత్రాత్మక పుణ్యక్షేత్రమైన సిర్సనగండ్లలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. లోక కల్యాణం కోసం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లు పాల్గొన్నారు.

ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరంస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య అర్చకులు సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది.



**దక్షిణ అయోధ్యగా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి**

పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సిర్సనగండ్ల క్షేత్రానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాములోరి కళ్యాణం సందర్భంగా ఎలాంటి ఆలోచనయ సంఘటనలు జరగకుండా కల్వకుర్తి డి.ఎస్.పి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సేవాలాల్ మార్గం అనుసరించాలి

తొర్రూరు నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 27

సంత్ సేవాలాల్ చూపిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాలని గోర్ సిక్ వాడి రాష్ట్ర సాహిత్య అధ్యక్షులు గుగులోతు రాము నాయక్ అన్నారు.మండలంలోని పెద్దమంగ్యా తండాలో సేవాలాల్ మహారాజ్ భోగ బండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.పెద్ద మంగ్యా తండా మాజీ సర్పంచ్ జాటోతు రమేష్ నాయక్ ఆధ్వర్యంలో గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా రాము నాయక్ మాట్లాడుతూ లంబాడీల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. ప్రజల మేలు కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారని, వీటిలో ఆర్థిక సంస్కరణలు,మత మార్పిడులను అరికట్టడం, క్షేత్రధర్మాన్ని రక్షించడం వంటివి ప్రధానమైనవని గుర్తు చేశారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, హితబోధ చేశారన్నారు.దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారన్నారు.గోర్ సిఖ్ వాడి ఫౌండేషన్ అధ్యక్షులు మల్సూర్ నాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో నడవలన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని, బంజార సమాజాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో గోర్ సిఖ్ వాడి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాలోతు చిట్టిబాబు నాయక్, పూజారి జాటోతు టీకు నాయక్, జాటోత్ మోహన్,మాజీ సర్పంచ్ హపావత్ సురేష్ నాయక్, నాయకులు జాటోత్ రాజారాం, చిన్న మంగా నాయక్, దాసు నాయక్, మోతిలాల్, కాలు నాయక్, జాటోతు ధర్మ, మాలోత్ సంతోష్, వెంకన్న నాయక్, తుకారాం, విజయ్, గిరిజనులు రైతులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



## - భక్తులతో మార్మోగిన కళ్యాణ మండపం

పెద్దవంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఓరుగంటి సైదులు మార్చి 27

పెద్దవంగర మండలంలో ఉప్పరగూడెం గ్రామంలో సర్పంచ్ దుంపల శ్రీదేవి కుమారస్వామి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ని సీతారామ కళ్యాణ మండపంలో సీతారామ కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా కళ్యాణ కమనీయంగా జరిగింది. కల్యాణానికి ముందు సీతారామ లక్ష్మణ సమేత ఉత్సవ విగ్రహాలను హనుమంతు వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిం చారు. గ్రామంలో ప్రతి ఒక్కరు హాజరైన వేడుకను తిలకించారు. కల్యాణ వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి, అందంగా అలంకరించి ప్రధాన అర్చకుడు. మేళతా ళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతు



నిర్వహించారు. గ్రామ ప్రముఖులు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి అమ్మ వార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిం చారు. భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

ఈ కార్యక్రమంలో అనిల్-మేనకా, సోమా సాంబయ్య, సోమా వెంకటేశం, దుంపల వెంకట్రాములు, వేముల రఘు,ముసుకు శోభన్, శ్రీరామ్ సాంబి, నీలం సాంబయ్య, కట్టొజు భాస్కరా చారీ, దుంపల రామచంద్రు,గోటుకుల అశోక్,ధర్మపాల్, వేముల బిక్షం, శోభన్ పెంతల, దుంపల వేణు,బయన బిక్షం, దుంపల రామానుజశీ, తదితరులు పాల్గొన్నారు.





# చలో ఇంద్రపార్క్ ధర్నాను విజయవంతం చేయండి: వేముల మారయ్య

హైదరాబాద్,మార్చ్ 27 (నేటి ఫోకస్ న్యూస్):



ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న చలో ఇంద్రపార్క్ మహా ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో, అధిక పని భారం మోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనంగా రూ. 18,000 చెల్లించాలని, రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా గ్రేడ్-1 హోదా కల్పించడంతో పాటు పని పరిధిని పరిమితం చేయాలని సూచించారు. పని సమయంలో ప్రమాదాలు లేదా మరణాలు సంభవించిన సందర్భాల్లో కనీసం రూ. 50,000 ఆర్థిక సహాయం అందించాలని, రిటైర్మెంట్ సమయంలో రూ. 5 లక్షల వరకు సహాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం ధర్నాకు అనుమతి ఇచ్చినప్పటికీ, పలు ప్రాంతాల్లో ఆశా వర్కర్లు, కార్మిక నాయకులను పోలీసులు అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని విమర్శించారు. అయితే ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఆశా వర్కర్ల ఐక్యతతో చలో ఇంద్రపార్క్ ధర్నాను విజయవంతం చేస్తామని వేముల మారయ్య ధీమా వ్యక్తం చేశారు.